కథానిక

# కావ్యసుందరి కిమక

"హితశ్రీ"

వీధుల్లో విద్యుద్దీపాలన్నీ చంద్రుడితో సహకరించడం మానుకున్నాయి. కేశవరావు గదిలో దీపంమాత్రం కాంతికిరణాలు విరజిమ్ముతూనేవుంది. అతడి కలం ఇంకా నిశ్శబ్దానికి లొంగలేదు. దూరంలో స్టేషన్‌గంటలు వినిపిస్తున్నాయి. పన్నెండోగంట బయటికి లెక్కపెట్టింది రమ. కేశవరావు చకితుడై గడియారం వైపు చూసి ఓ సారి ఆవలించి మళ్లీ వ్రాయడం సాగించాడు. రమ విసుగ్గా అంది - "ఇహ పడుకోరా ఏమిటీరాత్రి?"

"ఐపోయింది. ఈ రెండుపంక్తులూ వ్రాసి-"

"పుష్పకవిమానంలో ఎంద రెక్కినా ఇంకా ఒకరికి చోటు మిగులుతుందట-"

"ఇప్పుడెందు కా సంగతి?"

"మీరు ఎంతసేపు వ్రాసినా ఆరెండుపక్తులూ పూర్తికావట్లే ఉంది."

"ఓ, అదా."

"రోజూ అర్ధరాత్రిదాకా ఏంరాత? ఆరోగ్యం చెడిపోదూ?" కేశవరావు కలం బల్లమీద పడేసి కండరాలు ఉబికేలా మోచేయిముడిచి అన్నాడు-

"ఇది ఉక్కుశరీరం. చిన్నప్పుడు చెడుగుడులో ఆరుగురూ కలిసి మీదబడ్డా వాళ్ళం దర్నీ వెలదాకా యీడ్చి మరీ వొదిలేవాణ్ణి. ఈనాడు టెన్నిస్‌రాకెట్ పట్టానంటే అవతల ఆటగాళ్లకి గడ గడ. ఏ మనుకున్నావో-"

"నన్ను నవ్వించటానికి ప్రయత్నించకండి. ఎంత ఆరోగ్యం ఉంటేమాత్రం రోజూ జాగరణ లేమిటి?"

"మరి ఈనోట్సు పూర్తిచేసి వాళ్ళ కివ్వొద్దూ-పగలంతా స్కూల్లోనే సరిపోతుందాయె."

"ఆ నోట్సు వ్రాయడం ఒప్పుకోకపోతే ఏం మునిగి పోయింది?"

"ఊరికే రాస్తున్నానా? డబ్బివ్వటంలేదా మరి?"

"డబ్బుకి ఆశపడి ఆరోగ్యం చెడగొట్టుకుంటారా?"

"ఉత్తడబ్బేనా? పేరు, ప్రతిష్ఠ రావడం లే? ఫలానా ఆయన నోట్సు అంటే కుర్రాళ్ళు ఎలా ఎగబడతారో తెలుసా?"

"ఎందు కొచ్చిన పేరు, నిద్రాహారాలు లేక పోయిం తర్వాత. సాయంత్రం టెన్నిసుకి వెళ్లడం కూడ మానేశారుటగా."

"ఎందుకు వెళ్ళడంలేదూ?"

"వెడుతున్నా రన్నమాట."

"మహారాజుగా."

"ట్యుటోరియల్ కాలేజిలో టెన్నిసుకోర్టు ఉంది కాబోలు."

"ట్యుటోరియల్ కాలేజీలోనా?"

"అవును. నాదగ్గర ఎందుకు దాస్తారు?"

"ఎవరు చెప్పారు?"

"ఎవరో ఒకరు. మీకు నాదగ్గర రహస్యాలు ఉంటాయనుకోలేదు."

"రహస్యంకాదు, రమా. అనవసరమని చెప్పలేదు." బుజ్జగింపుగా అన్నాడు కేశవరావు.

"ఎందుకు మీకింత డబ్బాశ. స్కూల్లో పాఠాలూ, మళ్లీ రాత్రి పన్నెండింటిదాకా జాగరణా - ఇంతకష్టపడి కూడబెట్టకపోతేనేం?" సమాధానంగా చిరునవ్వు నవ్వాడు కేశవరావు. కాస్సేపాగి మళ్ళీ అంది రమ-"ఇంకోచోట పని చేయటానికి స్కూల్ వాళ్ళు ఎలా ఒప్పుకున్నారు?"

"వాళ్లకి తెలియదు. తెలిస్తే ఒప్పుకోరు. అయినా కాగితంమీద ఏమీ లేదు."

"బాగానే ఉంది. ఎందు కొచ్చిన బాధ మీకు?"

మాట తప్పిస్తూ అన్నాడు కేశవరావు, "మెదడు మొద్దుబారింది. షర్టు జేబులో సిగరెట్ వుంది. ఇలా పడెయ్యి కాస్త."

రమ సిగరెట్ పెట్టె పైకి తీయడంలో ఏదో కాగితం కిందపడ్డది. "ఏమి టీ పచ్చకాగితం ?" అని రమ వంగి ఆ కాగితం తీయబోయేలోపుగా కేశవరావు తటాలున దానిని తీసి పుస్తకం అడుగున భద్రపరిచాడు. రమ నివ్వెరపోయి చూసింది.

తత్తరపాటు మరుగుపరచటానికి ప్రయత్నిస్తూ అన్నాడు కేశవరావు, "ఆఁ- ఏదో స్కూల్ తాలూకు కాగితం..."

రమకి కొద్దిగా కోపం వచ్చింది. అంది, "రహస్యమైందని కాబోలు."

విననట్టు నటిస్తూ విషయం తప్పించి అన్నాడు కేశవరావు, "చూడు రమా, ఇది ఆఖరి సిగరెట్. ఇహ మానేస్తాను."

"ఏం ?"

"ఆరోగ్యం చెడిపోతుంది. డబ్బిచ్చి అనారోగ్యం కొనుక్కోవడం ఎందుకు?"

"మీది ఉక్కు శరీరంగా ?" అంది రమ మనసులో నవ్వుతూ. నవ్వాడు కేశవరావు.

"అదికాక ఇదో దుర్వ్యయం. అధమం పాతిక రూపాయలైనా మిగుల్తాయి నెల నెలా. క్రమంగా మానేస్తాను. ఇప్పటికే చాలా వరకు తగ్గించాను."

రమ మాట్లాడలేదు. తన భర్త తన దగ్గర నుంచి ఏదో దాస్తున్నాడు. తనకి తెలియని, తెలియకూడని రహస్యాలు తన భర్తకు ఉన్నాయని ఊహించడం ఆమెకి ఎంతో కష్టం కలిగించింది. అతడు ట్యుటోరియల్ కాలేజీలో రహస్యంగా పనిచేస్తున్నాడని తను ఎవరి ద్వారానో వినవలసి వచ్చింది. ఆ పచ్చకాగితం-తను చూడకుండా జాగ్రత్త పడవలసిన అవసరం ఏమిటి తనభర్తకి. 'రమా, నువ్వు నా ప్రాణానికి ప్రాణం' అనగలిగిన తన భర్తకి తన దగ్గర రహస్యాలా ? చివుక్కుమన్నది ఆమె మనస్సు. కలిగిన మనస్సుతో, ఆలోచనల బరువుతో ఆమె క్రమంగా బాహ్యప్రపంచం మరచిపోయింది.

కేశవరావు వ్రాస్తూనే వున్నాడు.

హఠాత్తుగా కెవ్వుమన్న కేక విని వెనక్కి తిరిగి చూశాడు కేశవరావు. రమ మంచంమీద లేచి కూర్చుని భీతావహంగా చూసింది అతడి వైపు.

"ఏమిటి రమా, భయపడ్డావా ?"

"పీడకల" సర్దుకుని అంది రమ. "మీరింకా నిద్రపోలేదా ?"

"ఐపోయింది. ఇదిగో ఈ రెండుపంక్తులూ-" ఏదో చటుక్కున జ్ఞాపకంవొచ్చి రమ వైపు చూసి నవ్వాడు. రమకి కూడా నవ్వొచ్చింది. కాని నవ్వలేదు. ఆమె కళ్లు బల్లమీది పచ్చ కాగితం మీద నిలిచిపోయాయి.

కేశవరావు గ్రహించాడు. యథాలాపంగా చేతిలో పుస్తకం ఆ కాగితంమీద పడేశాడు.

"ఆ కాగితం ఏమిటి?" రమ అకస్మాత్తుగా అడిగింది.

"ఏ కాగితం?" తెలియనట్టు అన్నాడు కేశవరావు.

"అదే, పుస్తకం కిందది."

"ఆఁ- ఏదో మామూలు కాగితం." సమాధానం ఏదీ దొరక్క నసిగాడు కేశవరావు. "సరేగాని - ఇహపడుకో. లైటార్పేస్తున్నాను- ఒంటిగంట దాటింది."

రమ మాట్లాడకుండా లేచి బల్లదగ్గరకు వెళ్లింది. కేశవరావు వింతగా చూశాడు ఆమెవైపు. రమ పుస్తకం అడుగునుంచి ఆ పచ్చకాగితం తీసింది. కేశవరావు అడ్డుపెట్టలేదు. తల వాల్చాడు.

ఆ కాగితంమీది అక్షరాలు గబగబా చదివేసింది రమ. ఆమె ముఖం పాలిపోయింది. కాస్సేపటి నిశ్శబ్దం తర్వాత "ఇందుకా మీరు రాత్రింబగళ్లు శ్రమపడడం" అంది రమ.

"శ్రమ ఏముంది ఇందులో?" అన్నాడు కేశవరావు.

"వారంరోజులలో బాకీ తీర్చకపోతే దావా వేస్తారా బ్యాంకువాళ్లు?"

"అదే దాని అర్థం."

"అప్పు తెచ్చినట్టుగా కూడా మీరు నాతో చెప్పలేదు."

"అవును." పుస్తకంమీద దృష్టి ఉంచి అన్నాడు కేశవరావు.

"మీరు ప్రతీదీ నా దగ్గర దాస్తూ వొచ్చారు."

"నిజమే, ఏం చెయ్యను?"

ఈ సమాధానం రమకి కాస్త చిరాకు కలిగించింది.

"ఆ మాత్రం నా చెవిని వేస్తే మీ పరువు పోతుందా?" అంత కటువుగా అనాలని అనలేదు రమ. అప్రయత్నంగా నోటినుండి జారిన ఆ మాటలకి రమ తర్వాత నొచ్చుకోకపోలేదు.

"నా పరువుకోసం కాదు రమా. అనవసరంగా నీకు బాధ కలిగించడం ఇష్టంలేక. మనం కాస్తో కూస్తో ఉన్న వాళ్ళమని నీ అభిప్రాయం. నీకు ఆశాభంగం కలిగించడం నాకు ఇష్టంలేదు.

"బాగానే వుంది."

"నిజం."

"ఐతే ఇంత ఖర్చుదేనికి - ఉన్నదాంట్లో సరిపెట్టుకోవాలిగాని నేను ఎంత పోరుపెట్టినావిన్నారా! ఈఇల్లు ఓపెద్దకుటుంబానికి సరిపోయేదికదా, ఇంత ఇల్లు దేనికి మనకి? మనిద్దరికీ ఓ వంట మనిషా? ఇహ గుడ్డలకీ వాటికీ అయే దుబారాకి లెక్క లేదు."

"భార్యని సుఖపెట్టలేనివాడు—"

"సుఖం అంటే అర్థం మీకు బాగానే తెలుసు!"

"నువ్వేమైనా అను రమా, నువ్వు నా కలల రాణివి. నీతల్లో పూవుమీద ఈగ వాలినా నేను సహించలేను. విసుగు, బాధకలిగించే ఈ లోకపు దైనిక కష్టనిష్ఠూరాలకి అతీతంగా ఆనందమయ ప్రపంచంలో నువ్వు నిరాఘాటంగా విహరించడమే నాకు కావలసింది. అదేనాకు తృప్తి. అందుకోసం నేను ఎంత శ్రమించినా విశ్రమించి నట్టే వుంటుంది నాకు."

జీవితకాలం అంతకీ తనకి విధించబడ్డ సౌఖ్యం అంతా ఆ ఒక్కక్షణంలో అనుభవానికి వొచ్చినట్టయింది రమకి. "ఇంతప్రేమ నేను భరించలేను" అంది రమ హృదయం. సిగరెట్టు వెలిగించటానికి కేశవరావు గీసిన నిప్పుపుల్ల మంటరివ్వున వీచిన గాలికి రెపరెపలాడింది. కాస్సేపటి నిశ్శబ్దం తర్వాత అంది రమ.

"ఇటువంటి భావాలు మీకెలా అలవడ్డాయో అర్థంకాకుండా వుంది. అరమోడ్పు కళ్ళతో, అజంతాసుందరి భంగిమలతో వాస్తవిక జగత్తుతో సంబంధంలేకుండా జీవితం గడపటమేనా స్త్రీ ఆశయం? ఇంత చదివినా మీరింకా ఈ ఇరవయ్యో శతాబ్దంలో జీవితభాగస్వామినికి బదులు కావ్యసుందరినే చూడ గోరుతున్నారు."

రమనుంచి ఎంతో పొగడ్త ఆశించిన కేశవరావు ఆమె మాటలకి విస్తుపోయాడు.

"ఏమైనా అను రమా, నువ్వు కష్టించడం నేను సహించలేను"

"మీ రింత స్వార్థపరు లనుకోలేదు!"

కేశవరావు దిగ్భ్రాంతుడై రమ కళ్ళలోకి చూశాడు.

"అవును. ఎంత సేపటికీ మమ్మల్నిగురించే ప్రయత్నించారు. బరువంతా మీ ఒక్కరి భుజాలమీదే మొయ్యా లనుకున్నారు. నిజంగా మీరు నన్ను అంతగా ప్రేమిస్తే ఒక విషయం మీరు గ్రహించి ఉండవలసింది."

"ఏమిటది ?" అన్నాడు కేశవరావు కళ్ళు పెద్దవి చేసి

"మీ కున్నలాంటి హృదయమే ఎదుటి వాళ్ళకికూడా వుండవచ్చని. మీరు ప్రేమించినంత గాఢంగా ఎదుటివాళ్ళు మిమ్మల్ని ప్రేమించడం అసంభవం కాదని." కాస్సే పాగి మళ్ళీ అంది రమ, కేశవరావు కళ్ళలోకి సూటిగా చూస్తూ. "మీరు అహోరాత్రాలు శ్రమపడుతుంటే నేను ఎంత బాధపడ్డానో దేవుడికే ఎరుక. మీశ్రమ పంచుకోవాలని, మీ కష్టనిష్ఠూరాలలో సగం పాలు తీసుకోవాలని ఎంత ఆరాటపడ్డాను—ఆ అవకాశం మీరు నా కివ్వక పోవడం స్వార్థపరత్వం కాదా!"

సిగరెట్ సెగ వేలికి తగలడంతో కేశవరావు ఊహాప్రపంచంనుంచి తిరిగి వచ్చాడు. రమవైపు భావగర్భితంగా చూస్తూ అన్నాడు.

'రమా, నువ్వన్నది అక్షరాలా నిజం నాకూస్వార్థపరుడికీ ఏమీ తేడా లేదు."